విశాలమైన ప్రాంగణంలోనే ఉన్నా... ప్రస్తుతం ఏవైపు గోపురాలు కనిపించవు. తూర్పున మహాద్వారం ప్రస్తుత స్థితిని బట్టి అక్కడ రాజగోపురం కూడా జిల్లాలోని మిగతా ఆలయాలకు భిన్నంగా గజపుష్ట ఆకారంలో కనిపిస్తోంది. ఆలయం లోపల కుడ్యాల (గోడల)పై అపురూపమైన శిల్ప సంపద ఉంది. రామకృష్ణ, పరశురాముల శిల్పాలు, నృత్య భంగిమల శిల్పాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఆలయం గోడలపై ఎనిమిది ద్రవిడ తమిళ లిపి గల శాసనాలు ఉన్నాయి. ఆలయానికి పక్కనే ఉత్తరంగా 72 స్తంభాల రాతి మండపం తూర్పు, పడమర దిశగా ఉంది. ఇది పూర్తిగా రాతి నిర్మాణం. మండపం చివర (పడమరన) సభా వేదిక ఉంది.

**చరిత్ర ఇలా!**

ప్రస్తుతం పరశురామాలయం ఉన్న ప్రాంతంలో క్రీస్తు పూర్వం బౌద్ధ, జైన మందిరాలుండేవని, ఆ తర్వాత వాటి స్థానంలో నాటి పాలకులు పరశురామాలయాన్ని నిర్మించి వైష్ణవాన్ని ప్రచారం చేశారని చరిత్రకారుల అభిప్రాయం. క్రీస్తు పూర్వం 5వ శతాబ్దినుంచి ఒకటో శతాబ్దం వరకు ఈ ప్రాంతంలో బౌద్ధ జైన మతాలు వైభవాన్ని చూశాయని, ఆ సమయంలోనే ఇక్కడ బౌద్ధ, జైన ఆరామాలు, విద్యాలయం నిర్మించారని తెలుస్తోంది. ఈ మతాలు క్షీణించగానే ఆ నిర్మాణాల స్థానంలో పరశురామాలయం వెలిసిందని వైష్ణవం విస్తరిల్లడం మొదలైందని తెలుస్తోంది. అత్యంత విశాలమైన జైన (బౌద్ధ) మండపంలో, ఆ తర్వాత లోపలివైపు గర్భాలయం కట్టి పరశురాముని మూల మూర్తిని ప్రతిష్టించినట్లు కూడా తెలియవస్తోంది. పరశురామాలయానికి ఎదురుగా తూర్పున చిన్న గుట్టపై శ్రీ త్రైతేశ్వరస్వామి ఆలయం, దానికి వెనుక ఈశాన్యంలో గదాధరుని (విష్ణుమూర్తి) ఆలయాలను నేటికీ మ నం చూడవచ్చు. చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే ఇక్కడి ప రశురామాలయం క్రీస్తు శకం ప్రారంభమైన కాలంలోనే అంటే రెండు వేల సంవత్సరాల క్రితం నిర్మించిందని తెలుస్తోంది. జిల్లాలోని అత్యంత ప్రాచీనమైన దేవాలయాల్లో ఇదొకటి.

**ఏకా తాతయ్య**

ఆలయంలో మూలమూర్తికి ఎదురుగా మంటపం లో మూడు అడుగుల 'ఏకాతాతయ్య' విగ్రహం ఉంది. ఆయ న స్థానిక భక్తుడని, శిథిలమై ఉన్న ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారని, అందుకే ఆయన విగ్రహాన్ని' ఆలయంలో స్వామి ఎదురుగా ఏర్పాటు చేశారని తెలుస్తోంది. తలనొప్పి సమస్య ఉన్న వారు ఆ విగ్రహం తలకు తమ తలను తాకిస్తే సమస్య తొలగిపోతుందని విశ్వాసం. ఏకా తాతయ్య విగ్రహం కొద్దిగా ఆళ్వార్లను, మరికొద్దిగా బౌద్ధ, జైన సన్యాసులను పోలి ఉంది. నాటి ఈ ప్రాంత పాలకుల్లో ఒకరైన కాయస్త అంబదేవుడు ఇక్కడ బాహుదా నదికి వరద నిరోధక కరకట్ట నిర్మింపచేశాడు. పరశురామాలయం ముందు నుంచి బాహుదానదికి కిలోమీటరు దూరం వరకు తీరం వెంబడి పొడవైన నీటి మడుగు ఉంది. ఈ నది (మడుగు) తీరాన పెద్దల పేరిట కర్మకాండలు చేస్తే వారికి పుణ్యగతులు దక్కుతా యన్నది ప్రజల విశ్వాసం. గయ క్షేత్రంలో లాగానే ఇక్కడ కూడా పిండ ప్రదానంతో కర్మకాండలు చేస్తుండటంతో అత్తిరాల క్షేత్రం 'దక్షిణ గయ'గా ప్రసిద్ధి గాంచింది. కార్తీక మాసంలో ఈ క్షేత్రం వేలాది మంది భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది.



**ఇలా చేరుకోవచ్చు**

తిరుపతి (రేణిగుంట), ముంబయి, హైదరాబాద్ నుంచి కడప మీదుగా నడిచే అన్ని రైళ్లు రాజంపేట, కడప, స్టేషన్లలో ఆగుతాయి. అక్కడి నుంచి అత్తిరాలకు బస్సు సౌకర్యం కూడా ఉంది. కడప నుంచి 55 కి.మీ, రాజంపేట నుంచి 5 కి.మీ దూరంలో ఈ క్షేత్రం ఉంది.

